27.5.2020

పల్లవి:

ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవె రామచంద్రా నన్ను
రక్షింపకున్నను రక్షకులెవరింక రామచంద్రా ఇ..

చరణము(లు):

చుట్టుప్రాకారములు సొంపుగ చేయిస్తి రామచంద్రా
ఆ ప్రాకారమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్రా ఇ..

గోపురమంటపాలు కుదురుగ గట్టిస్తి రామచంద్రా నను
క్రొత్తగ జూడక నిత్తరిబ్రోవుము రామచంద్రా ఇ..

భరతునకు చేయిస్తి పచ్చలపతకము రామచంద్రా
ఆ పతకమునకుబట్టె పదివేల వరహాలు రామచంద్రా ఇ..

శత్రుఘ్నునకు నేను చేయిస్తి మొలత్రాడు రామచంద్రా
ఆ మొలత్రాడునకు బట్టె మొహరీలు పదివేలు రామచంద్రా ఇ..

లక్ష్మణునకు జేయిస్తి ముత్యాలపతకము రామచంద్రా
ఆ పతకమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్రా ఇ..

సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా
ఆ పతకమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్రా ఇ..

వాహనములు మీకు వరుసతో జేయిస్తి రామచంద్రా జగ
న్మోహన సంకెళ్ళు వేసిరి కాళ్ళకు రామచంద్రా ఇ..

Scanned with CamScanner

కలికితురాయి నీకు పొలుపుగ జేయిస్తి రామచంద్రా
నీవు కులుకుచు దిరిగెద వెవరబ్బసొమ్మని రామచంద్రా ఇ..

మీ తండ్రి దశరథమహారాజు పెట్టెనా రామచంద్రా
లేక మీమామ జనకమహారాజు పంపెనా రామచంద్రా ఇ..

అబ్బా తిట్టితినని యాయాసపడవద్దు రామచంద్రా
ఈ దెబ్బలకోర్వక అబ్బ తిట్టితినయ్య రామచంద్రా ఇ..

సర్కారు పైకము తృణముగనెంచకు రామచంద్రా
దెబ్బలకోర్వను యప్పుదీర్చుమయ్య రామచంద్రా ఇ..

ఏటికి జల్లిన నీళ్ళాయె నా బ్రతుకు రామచంద్రా
నేను అధములందరికంటె అన్యాయమైతిని రామచంద్రా ఇ..

కౌసల్యపుత్రుడ దశరథతనయుడ రామచంద్రా
కావు క్షేమముగ భద్రాద్రి నెలకొన్న శ్రీరామచంద్రా ఇ..

భక్తులందరిని పరిపాలించెడి శ్రీరామచంద్రా
నీవు క్షేమముగ రామదాసుని నేలుము రామచంద్రా ఇ..

Scanned with CamScanner

27.5.2020

ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవె..

'ఏమయ్యా ! నీకు నేను ఇన్ని చేసాను. నాకు ఈ మాత్రం చేయవా!' అని లోకంలో మనకు బాగా ఆత్మీయులైనవారితో దబాయిస్తాం. నాలుగు మాటలంటాం. పడతాం. అందులో ఒక కమ్మదనముంది.' ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవె రామచంద్రా నన్ను రక్షింపకున్నను రక్షకులెవరింక రామచంద్రా'అను ప్రసిద్ధమైన రామ కీర్తనలో కూడా ఈ నొగసైన దబాయింపు ఉంది. రాములవారి వంశంలో ఇక్ష్వాకు, రఘువు మొదలయినవారు సుప్రసిద్ధులు. వారి వల్ల రాములవారి వంశానికి ఇక్ష్వాకు వంశం ,రఘు వంశం అని పేర్లు వచ్చాయి. 'ఇక్ష్వాకు వంశం మొత్తానికి గొప్పవాడా ! నువ్వు నాతో మాట్లాడకపోతే, సాయం చేయకపోతే నీకున్న పేరు మొత్తం పోతుంది.. ఏమనుకొన్నావో.. ఏమో.. అయినా రామచంద్రా ! నువ్వు రక్షించకపోతే, ఇంకెవరు నన్ను రక్షిస్తారు..చెప్పు..' ఇలా సాగే ఈ పల్లవి మొదటి పంక్తిలో బెదిరింపు ఉంది.

రెండవ పంక్తిలో శరణముంది. ఇది భక్తకవులకు మాత్రమే సాధ్యమైనది. తను ఒక మంచి పని చేస్తే, చెడ్డపని చేసావని నిందారోపణ వచ్చింది. కొడుకు భరించలేకపోయాడు. తన కష్టాన్ని తండ్రికి చెబుతున్నాడు. 'ఏమయ్యా రామయ్యా ! నీగుడికి ప్రాకారాలు (చుట్టు గోడ) ఎంత బాగా చేయించాను. దానికి పదివేల వరహాలు (వరాహముద్రగల బంగారునాణెములు) ఖర్చయింది. నేను తినేసానని చెబుతారేమిటి? నువ్వే చెప్పు'మని ఆత్మీయంగా రామునితో పోట్లాడాడు భక్తరామదాసు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి రాములవారికి నగలు, కిరీటాలు, శఠారి, ఛత్ర, చామరాలు, వస్త్రాలు మొదలైనవన్నీ రామదాసు చేయించాడు.

చింత చిగుర్లాంటి ఎర్రని రాళ్లను పొదిగిన నగను- చింతాకు పతకాన్ని -సీతమ్మకు, రాముని అలంకరణకు కలికితురాయినీ (కొంగతల యీకలతో చేసిన శిరోభూషణం) లక్ష్మణునికి ముత్యాల పతకం, భరత శత్రుఘ్నులకు వరుసగా పచ్చల పతకం, రవ్వల మొలతాడు చేయించాడు. వీటన్నింటికి ఒక్కొక్కదానికి పదివేల వరహాలు అయిందని ఈ కీర్తనలో రామదాసు మొరపెట్టుకొన్నాడు. దెబ్బ మీద పడుతుంటే అమ్మా అని సామాన్యంగా నోటినుంచి పిలుపు వస్తుంది. కాని రామదాసు ఒంటి మీద దెబ్బ పడుతుంటే ' అయ్యా.. రామయ్యా !' అనే పిలుపువచ్చింది. ఎవరబ్బ సొమ్మని కులుకుతూ తిరిగేవు అనే స్థాయిని' ఆ బాధ చేరింది.'

మీ తండ్రి దశరథ మహారాజు పెట్టెనా ! లేక మీమామ జనకమహారాజు పంపెనా రామచంద్రా 'అని దెప్పిపొడుపు అన్న భక్తుడు అంతలోనే లెంపలు వాయించుకొని "ఈ దెబ్బలకోర్వక అబ్బ తిట్టితినయ్యా.. నన్ను క్షమించు'అన్నాడు. 'ఇవన్నీ నీకు నేను అప్పు ఇచ్చాను, తీర్చు' అంటూ నా బతుకు ఏటిలో చల్లిన నీళ్ల లెక్కయిందని రామదాసు వాపోయాడు. ఏటిలో చల్లిన నీళ్లను గుర్తించి తిరిగి తీయటం అసాధ్యం. నీకు, నీవాళ్ళకు నేనుఖర్చు చేసిన డబ్బును తిరిగి ఇవ్వటం అసాధ్యం. నన్ను క్షేమంగా చూడు' అని రామదాసు ఈ కీర్తన ముగించాడు. బాధలోనుంచి పుట్టిన ఈ కీర్తనను ఎప్పుడు చదువుకొన్నా- బాధను మరిపిస్తుంది. అది ఈ కీర్తన ప్రత్యేకత.

Scanned with CamScanner

27.5.2020

పల్లవి:

నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి న..

చరణము(లు):

నను బ్రోవమని చెప్పవే నారీశిరోమణి
జనకుని కూతుర జనని జానకమ్మ న..

ప్రక్కను చేరుక చెక్కిలి నొక్కుచు
చక్కగ మరుకేళి సొక్కుచుండెడి వేళ న..

ఏకాంతరంగుడు శ్రీకాంత నినుగూడి
ఏకాంతమున నేకశయ్యనున్న వేళ న..

అద్రిజవినుతుడు భద్రగిరీశుడు
నిద్రమేల్కొనువేళ నెలతరో బోధించి న..

Scanned with CamScanner

27.5.2021

నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లి

రామదాసు కీర్తనలలోని కొన్ని పాదాలు తెలుగు వారి రక్తంలో కలిసాయి. ఆ పాదాలు మనందరి రక్తసంబంధం కలిగినవి. అటువంటి వాటిలో 'నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లి'ఒకటి. నిజానికి అమ్మ అన్నా, తల్లి అన్నా ఒకటే. కాని రామదాసు ఒకే అర్థం కల ఆ రెండు పదాలను కలిపి వాడాడు..ఎందుకంటె ఆప్యాయత ఎక్కువైనప్పుడు ఒకే పదాన్ని రెండుసార్లు పిలవటం తెలుగువారి సంభాషణల్లో సహజాతి సహజం.. దీనినే తెలుగు వారి నాలుకలపై కదలాడే కీర్తనలను రచించిన రామదాసు పాటించాడు. 'ఓ సీతమ్మ తల్లీ ! నన్ను రక్షించమని చెప్పవే.'.అని కవి పల్లవిలో చెప్పాడు. ఎవరికి చెప్పమంటున్నాడు.. ఏమి చెప్పమంటున్నాడో చరణాలలో మనకు కనబడుతుంది.

నారీశిరోమణి : 'నను బ్రోవమని చెప్పవే నారీశిరోమణి/జనకుని కూతుర జనని జానకమ్మ' అని అనుపల్లవి. సీతమ్మ ఆడువారందరిలోను గొప్పది. జనకుని కూతురు. ఈ విశేషాలు అందరికి తెలిసినవే కదా ! అయితే ఇక్కడ ఈ పదాల ప్రయోగాల వెనుక విశేషముంది. ఏ ఆడదానికయినా పుట్టిన రోజు ఉంటుంది. కాని సీతమ్మకి పుట్టిన రోజు లేదు. ఆవిడ జనకునికి ప్రత్యక్షమైన రోజు ఉంది. అందరికి అమ్మ అయిన ఆ తల్లి – ఒక అమ్మ కడుపున పుట్టలేదు. అందుకే ఆ అయోనిజ అయిన సీత విశిష్టత కలిగిన నారీ శిరోమణి. శ్రీరాముని దగ్గర సీతమ్మ ఉన్నప్పుడు ఆమెకు కీడు చేసిన కాకాసురుడు రాముని చేతిలో మరణించలేదు. సీతమ్మ దగ్గర లేనప్పుడు ఆమెకు కీడు చేసిన రావణాసురుడు రాముని చేతిలో మరణించాడు. రాక్షసుల మీద కూడా ప్రేమ చూపించకలిగిన , క్షమించకలిగిన ఉదాత్త హృదయ కనుక ఆమెను 'నారీశిరోమణి' అన్నాడు రామదాసు.

జనకుని కూతుర: ఇయం సీతా.. మమ సుతా ..(ఈ సీత.. నా కూతురు) అని జనకుడు శ్రీ రామకల్యాణ ఘట్టంలో చెబుతాడు. "రామయ్యా! నీకు సీత ఎవరో తెలీదు కదా, ఇదుగో ఈమె సీత, ఈమె నా కూతురు. నేను నీకు ఈమెని కామ పత్నిగా ఇవ్వడంలేదు, నీతోపాటు ధర్మంలో అనువర్తించడానికని ఈ పిల్లని ఇస్తున్నాను, అందుకని ధర్మపత్నిగా స్వీకరించు. రామ! ఆడపిల్ల తండ్రిని కదా, అందుకని ఆనందంలో ఇన్ని మాటలు అనేశాను, కాబట్టి నన్ను క్షమించు, ఈమెని నువ్వు పుచ్చుకో, నీ చేతితో మా అమ్మాయి అరచేతిని బాగా రాసి పట్టుకో( సూర్యవంశం వాళ్ళకి అరచేతిని అరచేతితో రాసి పట్టుకుంటే సుముహుర్తం, మనం జీలకర్ర-బెల్లం పెడతాం సుముహుర్తానికి), ఈ క్షణం నుంచి మా అమ్మాయి ఏది చేసినా అది, నా భర్త అని నీ కోసమే చేస్తుంది. రామ! మాది విదేహ వంశం, మాకు దేహమునందు భ్రాంతి ఉండదు, నా కూతురిని అలా పెంచాను. ఒక ఏడాది తరువాత నా కూతురు నీతో కలిసి పుట్టింటికి వచ్చినప్పుడు నేను నేర్పిన సంప్రదాయాన్ని మరిచిపోతే, అది నీ వల్లే రామ! ఎందుకంటే నేను నేర్పినదాన్ని భర్త ఉద్ధరించాలి, ఆ ఉద్ధరించడంలో పొరపాటు వస్తే అది నీదే అవుతుంది, ఆమె నిన్ను నీడలా అనుగమిస్తుంది." ఇదంతా 'ఇయం సీతా' శ్లోకం యొక్క రహస్యార్థంగా పెద్దలు వివరించారు. సీతమ్మ నీడలా రాముని అనుసరిస్తుందని జనకుడు చెప్పాడు. అందుకే రామునివెంట నిరంతరం ఉండే సీతమ్మ – రామునితో చెప్పి తనని బంధిఖానా కష్టాలనుంచి గట్టెక్కించాలని రామదాసు 'జనకుని కూతుర' అని ప్రయోగించాడు.

Scanned with CamScanner

సులభ ప్రసన్న: పాయసం తీసుకొన్న కౌసల్య పదినెలల తర్వాత రాముని కన్నది. పది నెలలతర్వాత లోకానికి దర్శనమిచ్చాడు రాముడు. కాని సీతమ్మ యజ్ఞం చేద్దామనే సంకల్పంతో జనకుడు ఇంకా యజ్ఞభూమి దున్నుతున్నాడో లేదో, వెంటనే కనబడింది. కనుక సీతమ్మ – రామయ్య కంటె సులభ ప్రసన్న.జనకునికి ఎంత సులభంగా కనబడి అనుగ్రహించావో , నన్ను కూడా అలాగే సులభంగా కష్టాలనుంచి గట్టెక్కించమని, జనక ప్రసక్తిని కవి తీసుకు వచ్చాడు.

ప్రక్కను చేరుక చెక్కిలి నొక్కుచు: "ఓ సీతమ్మా ! శ్రీ రాముడు నీ పక్కనచేరి , నీ చెక్కిలి నొక్కుతూ రతికేళిలో పరవశిస్తున్న సమయంలో నాగురించి. రామయ్యకు చెప్పు. నీ ఒక్కరి మీదే మనస్సు కలిగిన మా శ్రీ రాముడు..ఏకాంతములో ఏకశయ్యలో నీతో ఉన్న సమయంలో నాబాధల గురించి శ్రీ రామునికి చెప్పు. పార్వతీదేవి చేత కొనియాడబడే (అద్రిజ వినుతుడు) ఆ భద్రాచల దేవుడు శ్రీరాముడు నిద్రమేల్కొను సమయంలో – నా ఇబ్బందిని ఆస్వామికి చెప్పు తల్లీ "అని ఈ నను బ్రోవమని చెప్పవే గీతంలోని చరణాల స్థూలార్థం.ఈ సమయాలేమిటి? అని నాగరికులు ఈ చరణాలను చదివే సమయంలో ఇబ్బంది పడతారు.

పైకి శృంగారం.. లోపల వేదాంతం: తన గోడును స్వామికి విన్నవించమని లక్ష్మిని అడగడం ఒక విశిష్టాద్వైత సంప్రదాయం . ఆమెను పురుషకారిణిగా ఈ సంప్రదాయంలో భావిస్తారు. విశిష్టాద్వైత సంప్రదాయం. భగవంతునికి. ఉండే కోపాన్ని లక్ష్మి తగ్గిస్తుంది. జీవునికి, దేవునికి మధ్య ఆ తల్లి మధ్యవర్తిత్వం చేస్తుంది. అందుకే రామదాసు - రామ ప్రసాదానికి సీతమ్మని ప్రార్థించాడు.ఇదొక సమన్వయం.

"ప్రకృతి" అంతా స్త్రీ స్వరూపమే. ఇదే "మహామాయ"."దేవుడు" ఒక్కడే "పురుషుడు"."మాయ" ను అధీనంలో ఉంచుకున్న "పురుషుడు" "దేవు"డే."మాయ" అధీనంలో ఉన్న "పురుషుడు" జీవుడు. ఈ పురుషుడు మాయ నుండి విడివడి పోదామన్నా పోనివ్వదు.ఈ "మహామాయ" ఉండనివ్వదు, వదలదు, వదలనివ్వదు.అందుకే నను బ్రోవమని చెప్పవే "సీత" మ్మ తల్లీ. అని జీవుడైన రామదాసు మాయకు(సీతమ్మకు) విన్నవించాడు.ఈ పురుషుడు (జీవుడైన రామదాసు)"మాయ" ను ప్రార్థిస్తే ఆ "మహామాయ".తన అధీనంలో ఉన్న "పురుషున" కు(రామునికి) విన్నవిస్తే అది విని,ఆ"పురుషుడు" "మహామాయ" కు అనుమతిస్తే. ఆ "మాయ".జీవుణ్ణి వదులుతుంది. అప్పుడు ఆ జీవుడు "దేవు'డవుతాడని దీనికి లోతయిన సమన్వయం పెద్దలు చెప్పారు. మాయనుంచి విడివడటానికి జీవుడు చేసే వేదనకు - ఈ మహా వేదాంతరహస్యానికి- రామదాసు శృంగారపు పరదాలు కప్పాడు.చెక్కిలినొక్కటమేమిటండి..రతికేళి ఏమిటండి..అని ..".ఇహ్హిహిహి ల"దగ్గర ఆగిపోతే –మాయా ప్రపంచంలో జన్మల పరంపర అలానే కొనసాగుతుంటుంది.

భగవాన్ శ్రీ రమణ మహర్షిని ఒక భక్తురాలు," త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు వీరంతా గానం చేసి తరించారు కదా! అది అందరికీ సాధ్యమవుతుందా?" అనిఅడిగింది దానికి మహర్షి చిన్న చిరునవ్వుతో ఇలా "అమ్మా! వారంతా గానంతో తరించలేదే, తరించాకే ఆ అనుభవాన్ని గానం చేశారు."అని జవాబిచ్చారు.

Scanned with CamScanner